అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లో చేరికలు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్

- నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరాలి
- మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి రసమయి బాలకిషన్

తిమ్మాపూర్, అక్టోబర్ 25: నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేశామని, ఆ అభివృద్ధిని చూసే కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లోకి వస్తున్నారని మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ రసమయి బాలకిషన్ స్పష్టం చేశారు. బుధవారం తిమ్మాపూర్ మండలంలోని పోలంపల్లి, నర్సింగాపూర్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు, యువకులు పెద్దసంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి తిమ్మాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో రసమయి బాలకిషన్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మారుమూల గ్రామాలను గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్ది అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గ్రామాల అభివృద్ధిని చూసి ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్ వైపు వస్తున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీ వల్ల అభివృద్ధి జరుగదన్నారు. మానకొండూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త సన్నద్ధం కావాలని కోరారు. అనంతరం పలువురికి నియామక పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. మైనార్టీ సెల్ మండల ఉపాధ్యక్షుడిగా మహ్మద్ నబీ, యూత్ మండల ఉపాధ్యక్షుడిగా కోతి నరేశ్, యూత్ మండల ప్రధాన కార్యదర్శిగా సంగాల పవన్, విద్యార్థి విభాగం మండల ఉపాధ్యక్షుడిగా గొట్టిపర్తి మధుకర్‌ను నియమిస్తూ ఉత్తర్వులను అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో పార్టీ మండలాధ్యక్షుడు రావుల రమేశ్, నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాస్‌రావు, వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే పల్లెలు సుభిక్షం

- పార్టీ శంకరపట్నం మండలాధ్యక్షుడు గంట మహిపాల్
- తాడికల్‌లో ఎన్నికల ప్రచారం

శంకరపట్నం: తాడికల్ గ్రామంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రసమయి బాలకిషన్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

శంకరపట్నం, అక్టోబర్ 25: బీఆర్ఎస్ పాలనలోనే పల్లెలు సుభిక్షంగా ఉంటాయని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంట మహిపాల్ అన్నారు. బుధవారం మండలంలోని తాడికల్ గ్రామంలో మానకొండూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్‌కు మద్దతుగా తాడికల్ 3,4వ వార్డుల్లో ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో ఎమ్మెల్యే తన పదవీ కాలంలో అనేక ప్రజోపయోగమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలను ఆదరించారన్నారు. ప్రజలు ఆలోచించి కారు గుర్తుకు ఓటు వేసి సరైన నాయకుడైన రసమయి బాలకిషన్‌కు పట్టం కట్టాలని కోరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు బ్యాలెట్ పేపర్ నమూనా, కారు గుర్తు నంబర్, ఓటు వేసే విధానం, తదితర అంశాలపై ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బుద్దార్థి సంపత్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు సత్యం, యూత్ అధ్యక్షుడు వెంగల ప్రవీణ్, వార్డు సభ్యులు మూలవేద, ఆడెపు శిరీష, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆడెపు మల్లయ్య, మహిళలు పాల్గొన్నారు.

మానకొండూర్ మండలంలో ప్రచారం

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 25: మండలంలోని లింగాపూర్, జగ్గయ్యపల్లి, శ్రీనివాస్‌నగర్ గ్రామాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రసమయి బాలకిషన్‌కు మద్దతుగా నాయకులు, కార్యకర్తలు బుధవారం ప్రచారం చేశారు. సర్పంచ్ పొల్సాని మురళీధర్ రావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామాధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పర్లపల్లి పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనంలో నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

తిమ్మాపూర్ రూరల్, అక్టోబర్ 25: మండలంలోని పర్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1993-94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం స్కూల్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. 29 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలిసిన స్నేహితులంతా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అలాగే ఉపాధ్యాయులకు మళ్లీ పరిచయం చేసుకున్నారు. వారిని శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎన్పీడీసీఎల్ ఉద్యోగికి తీవ్రగాయాలు

శంకరపట్నం, అక్టోబర్ 25: మండలంలోని మొలంగూర్ క్రాస్ రోడ్డు వద్ద బుధవారం బైక్, కారు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన ఎన్పీడీసీఎల్ ఉద్యోగి మాతంగి నారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. అతడి రెండు కాళ్లు విరిగిపోవడంతో స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందజేయగా, సిబ్బంది ఈఎంటీ సతీశ్‌రెడ్డి, పైలెట్ ఖాజా ఖలీలుల్లా ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రుడిని ప్రథమ చికిత్స అందిస్తూ హుజూరాబాద్ ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. మాతంగి నారాయణ కరీంపేట్‌లో ఏఎల్ఎంగా విధులు నిర్వహిస్తున్నారు.

క్రికెట్ ట్రోఫీతో ఆదర్శ యూత్ జట్టు, నాయకులు

ముగిసిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ

శంకరపట్నం, అక్టోబర్ 25: జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ విజేతగా కేశవపట్నం ఆదర్శ యూత్ జట్టు విజయకేతనం ఎగురవేసింది. దసరా ఉత్సవాల్లో భాగంగా కేశవపట్నంలోని జడ్పీ స్కూల్ మైదానంలో ఆదర్శ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. బుధవారం చివరి రోజు ముగింపు సమావేశం నిర్వహించి విజేతలకు ట్రోఫీలు అందజేశారు. కేశవపట్నం ఆదర్శ యూత్ జట్టు గెలుపొందగా, రన్నరప్‌గా క్లబ్ లెవెన్ టీమ్ నిలిచింది. టోర్నీ విజేత జట్టుకు ఎంపీటీసీ ఏనుగుల అనిల్, ఉప సర్పంచ్ గజ్జెలి హనుమంతు, కత్తెరమల్ల కృష్ణస్వామి సంయుక్తంగా రూ.15 వేల నగదు బహుమతి అందజేశారు. రన్నరప్ జట్టుకు ఎంపీటీసీ బొజ్జ కవిత-కోటిలింగం రూ.10 వేల నగదు బహుమతి ప్రదానం చేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును వార్డు సభ్యుడు పురెళ్ల ప్రశాంత్‌గౌడ్ స్పాన్సర్ చేయగా, ట్రోఫీలు, టీషర్ట్స్‌ను బీఎస్పీ రాష్ట్ర అధికార ప్రతినిధి జక్కని సంజయ్ కుమార్ అందజేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ మొలుగూరి సదానందం, ఆదర్శ యూత్ అధ్యక్షుడు అభిలాష్ బొంగోని, సీనియర్ నాయకుడు బండారి తిరుపతి, అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధి మేరుగు శ్రీనివాస్, నాయకులు, యూత్ నాయకులు, క్రీడాకారులు, సంపత్, సుధీర్, చెరుకు శివకుమార్ గౌడ్, మణి సాయి,రాకేశ్, అక్షయ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడి పరామర్శ

పచ్చునూర్‌లో ఎల్లమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి, బియ్యం అందజేస్తున్న టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల ప్రభు తదితరులు

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 25: పచ్చునూర్ గ్రామానికి చెందిన దాసారపు ఎల్లమ్మ ఇటీవల మృతి చెందగా, బుధవారం బాధిత కుటుంబాన్ని టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల ప్రభు పరామర్శించారు. 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఇక్కడ మృతురాలి కుటుంబ సభ్యుడు టీజీపీఏ సెక్యూరిటీ ఫోర్స్ కన్వీనర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దాసారపు సదానందం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుడిసె పవన్, జిల్లా అధ్యక్షుడు జీడీ వెంకటస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి దూడపాక శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సంగుపట్ల మల్లేశం తదితరులున్నారు.

వాగేశ్వరి కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్

తిమ్మాపూర్ రూరల్, అక్టోబర్ 25: మండల కేంద్రంలోని వాగేశ్వరి కళాశాలలోని కంప్యూటర్స్ సైన్స్ విభాగంలో ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్న తాళ్లపల్లి రవికుమార్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. 'డీప్ సెంటిమెంట్ అనాలసిస్ మెథడ్స్ యూసింగ్, మిషన్ లెర్నింగ్ ఫర్ఎక్స్ ట్రాక్షన్ ఆఫ్ బ్రాండ్ వ్యాల్యూ ఫర్ వేరియాస్ కన్స్యూమర్ ప్రొడక్ట్' అంశంపై ఆయన చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందని కళాశాల జనరల్ సెక్రటరీ డాక్టర్ గంధ్ర శ్రీనివాస్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టరేట్ పొందిన రవికుమార్‌కు కళాశాల జాయింట్ సెక్రటరీ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు వినోద్, సీహెచ్ ప్రకాశ్ రెడ్డి, ప్రిన్సిపాల్ సీఎస్ శ్రీనివాస్‌రెడ్డి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి చంద్రమౌళి అభినందనలు తెలిపారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

మానకొండూర్, అక్టోబర్ 25: జీవితంపై విరక్తి చెందిన ఓవ్యక్తి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం మానకొండూర్‌లో జరిగింది. స్థానిక సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన ఎనుగుల రవి(45) హమాలీ పని చేస్తు జీవిస్తున్నాడు. మూడు సంవత్సరాల క్రితం నూతన ఇల్లు కట్టుకోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. గతకొంతకాలంగా హమాలీ పనికి పోకుండా తాగుడుకు బానిస కావడంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. మూడు నెలల క్రితం రవి భార్య మాధవి.. కూతురు అక్షర, కుమారుడు మారుతిని తీసుకుని ఆమె తల్లిగారి ఇంటికి వెళ్లడంతో రవి ఒక్కడే ఇంట్లో ఉంటున్నాడు. ఈక్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో రవి బుధవారం వేకువ జామున దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.